# పాలకుల తల్లక్రిందుల అభివృద్ధియొక్క సంక్షోభం

## ఐఎల్ & ఎఫ్ఎస్ పతనం

**బ్యాంకింగేతర** ద్రవ్యకంపెనీ (ఎన్‌బిఎఫ్‌సి) అయిన 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్' (ఐఎల్&ఎఫ్ఎస్) సంస్థను భారత ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకుంటూ, ఐఎల్ఎఫ్ఎస్ పతనం, భారతదేశ "ఆర్థిక స్థిరత్వాన్ని" శక్తివంతంగా దెబ్బతీసి విపత్కర పరిణామాల్ని కలగజేస్తుందని పేర్కొంది. ఒకే ఒక కంపెనీ పతనమైతే, అది దేశ ఆర్థిక స్థిరత్వానికి ఏవిధంగా భంగకరమౌతుందో సామాన్య మానవు లెవరికీ అంతుపట్టని విషయం. ఆర్థికమంత్రి పలుమార్లు పేర్కొంటున్నట్లు, ప్రపంచ మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ, అంతగా పుటుక్కున తెగిపోయేదిగా మారిపోయిందా?!

మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రుణాలు ఇచ్చేందుకు ఐఎల్ఎఫ్ఎస్ సంస్థ స్థాపించబడింది. దీనిలో – ఎల్ఐసి, ఎస్‌బిఐ, యుటిఐ, హెచ్‌డిఎఫ్‌సి, సెంట్రల్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటివి ప్రధాన భాగస్వాములుగా వున్నాయి. ఇవన్నీ ప్రభుత్వా ధీనంలోని ద్రవ్య సంస్థలే. కనుక, ఐఎల్ఎఫ్ఎస్ కూడా ఆర్థికమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్నా ప్రభుత్వ అధీనంలోని కంపెనీగానే వుంది. ఐఎల్ఎఫ్ఎస్ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఇతర బోర్డు సభ్యులను ప్రభుత్వమే నియమిస్తుంది. ఐఎల్ఎఫ్ఎస్‌ను ప్రభుత్వం తన ప్రత్యక్ష అధీనంలోకి తీసుకోవటం కేవలం ఒక కుతంత్రం మాత్రమే. అన్ని ఆచరణాయుత ప్రయోజనాలన్నింటికీ అది ప్రభుత్వ యాజమాన్యంలోనే వుంటోంది.

బ్యాంకింగేతర ద్రవ్యకంపెనీ (ఎన్‌బిఎఫ్‌సి)గా వున్న ఐఎల్ఎఫ్ఎస్‌కి ప్రజల నుండి నిధులు సమకూర్చుకోవటానికి అనుమతి వుండదు. కనుక, అది తన నిధులను రుణమార్కెట్ నుండి సేకరించుకొని, ప్రధాన రహదారులు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, విద్యుత్తురంగ పరిశ్రమలు మొదలైన మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఎక్కువ వడ్డీరేటుకు తిరిగి అప్పులివ్వటం జరుగుతోంది. అయితే ఈ ప్రాజెక్టులు ఐఎల్ఎఫ్ఎస్ నుండి తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించటంలో విఫలమైతే, రుణమార్కెట్‌నుండి తాను తీసుకున్న డబ్బును తిరిగి చెల్లించే సామర్థ్యం ఐఎల్ఎఫ్ఎస్‌కు లేదు.

భారతదేశంలో బ్యాంకింగేతర ద్రవ్యసంస్థల నియంత్రణాధికారాన్ని భారత రిజర్వ్‌బ్యాంకు (ఆర్‌బిఐ) కలిగి వుంది. బ్యాంకింగేతర ద్రవ్య సంస్థలు తప్పనిసరిగా కలిగివుండాల్సిన డిపాజిట్లు – చెలామణి – ఈక్విటీ నిష్పత్తులు మొదలైన వాటి గురించి నిర్వచించిన చాలా స్పష్టమైన విధి విధానాలు ఆర్‌బిఐకి వున్నాయి. ఐఎల్ఎఫ్ఎస్‌లో ఏంజరుగుతోందో ఆర్‌బిఐ మరియు ఆర్థికశాఖా మంత్రి తెలుసుకొని వుండవచ్చు. పరపతి రేటింగ్ సంస్థలు మాత్రం ఐఎల్ఎఫ్ఎస్‌కి "ట్రిపుల్ ఏ" స్థాయి నిచ్చాయి.

2018 సెప్టెంబర్‌లో ఎస్ఐడిబిఐ(భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు) నుండి తీసుకున్న 450 కోట్ల రూ॥ల స్వల్పకాలిక రుణ చెల్లింపుతోసహా ఐఎల్ఎఫ్ఎస్ వరుసగా చెల్లింపులు చేయటంలేదు. రానున్న ఆరునెలలపైగా కాలంలో ఐఎల్ఎఫ్ఎస్ తిరిగి చెల్లించాల్సిన పెద్దమొత్తమైన రు.3700 కోట్లలో ఇది కూడా భాగం. అయితే సెప్టెంబర్‌లో ఐఎల్ఎఫ్ఎస్ వద్ద కేవలం 200 కోట్ల రూ॥ నిల్వలు మాత్రమే వున్నాయి. కాగా ఐఎల్ఎఫ్ఎస్ పొందిన రుణమొత్తం 91,100 కోట్ల రూ॥గా వుంది. దీనిలో 60 శాతం ప్రభుత్వరంగ బ్యాంకులనుండి పొందిందే.

మార్కెట్‌నుండి రుణాలను సేకరించేటప్పుడు రుణం – ఈక్విటీ విధానాన్ని చాలా ఎక్కువగా 3:1గా ఐఎల్ఎఫ్ఎస్ ప్రకటించింది. ఆర్‌బిఐకి, ఆర్థికమంత్రికి తెలియకుండా ఈవిధంగా జరగదు. ఉద్దేశ్యపూర్వకంగానే వారు ఈ సూచనలు ఖాతరు చేయలేదు. మరోవైపున భారత జాతీయ రహదార్ల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) మరియు ఇతర సంస్థలు ఐఎల్ఎఫ్ఎస్‌కు తిరిగి చెల్లించాల్సిన దాదాపు 16 వేల కోట్ల రూ॥ రుణాన్ని చెల్లించలేక పోయాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు ఈపాటికే తిరిగి చెల్లించబడని 9 లక్షల కోట్ల రూ॥లతో నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఏ) వూబిలో కూరుకుపోయి వున్నాయి. దీనిలోని అత్యధిక భాగం కూడా మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టిన నిర్మాణరంగ కంపెనీలదే కావటం గమనార్హం. ఏమైనా, అనివార్యంగా ఐఎల్ఎఫ్ఎస్ పతనమైంది.

ఈ భంగపాటు ఎలా జరిగింది? చాలాకాలం క్రితమే 1990లలో ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలుగా పిలవబడేవానితో ఈ కథ వేగవంతమైంది. పారిశ్రామిక అభివృద్ధి కోసం అవసరమైన విదేశీ పెట్టుబడిని ఆకర్షించేందుకు పెద్దస్థాయిలో మౌలిక వసతుల నిర్మాణం చేపట్టాల్సిందిగా భారత ప్రభుత్వానికి ప్రపంచబ్యాంకు 'సలహా' ఇచ్చింది. వినయ విధేయలతో భారత ప్రభుత్వం ఈ సలహా అమలుకు పూనుకుంది ఏ పరిశ్రమలలోకి ఎంత విదేశీ పెట్టుబడి వస్తుందనే దాని గురించిన పట్టింపే లేకుండా, నిర్మిస్తున్న మౌలిక వసతులు ఏ పరిశ్రమకు ఎంతవరకు అవసరమౌతాయనే స్పృహ కూడా లేకుండా, విచ్చలవిడిగా నిర్మాణాలను చేపట్టింది. నిర్దిష్ట పరిశ్రమల నిర్మాణం జరిగితే వానికి అవసరమైన మౌలిక వసతుల నిర్మాణం చేయటం సబబుగా వుంటుందిగానీ, మన పాలకులు దీనిని తల్లక్రిందులుగా చేశారు. ఏ పరిశ్రమకు ఏ అవసరాలు వుంటాయనే దానితో నిమిత్తం లేకుండా ప్రభుత్వాలు తమ ఆర్థిక వనరులలో అధిక భాగాన్ని, అప్పులు చేసి కూడా, మౌలిక వసతుల నిర్మాణంపై వెచ్చించాయి. గుర్రానికి ముందు బండిని కట్టివేయటమంటే ఇదే!

టోల్ రుసుము వసూలు చేస్తోన్న అత్యధిక హైవేలు – ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో (పిపిపి) సహా–వాటి ఆర్థిక రుణభారాన్ని తిరిగి చెల్లించటానికి అవసరమైన ఆదాయాన్ని సృష్టించు కోవటంలో విఫలమయ్యాయి. ఆ కారణంగానే ఐఎల్ఎఫ్ఎస్‌తో సహా ఇతర సంస్థలకు ఎన్‌హెచ్ఏఐ తిరిగి చెల్లింపులు చేయకుండా చేతులు ఎత్తివేసింది. కొన్ని పిపిపి నమూనా హైవే ప్రాజెక్టులు అమ్మకానికి పెట్టబడ్డాయి. అయితే కొనుగోలుదారులెవరూ దీనికి సిద్ధంగా లేరు. పిపిపి నమూనాలో నిర్మాణంలోవున్న మరో 14 హైవే ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా మధ్యలోనే నిలిపివేయ బడ్డాయి. జాతీయ థర్మల్ విద్యుత్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి)తో సహా నూతనంగా నిర్మించిన అత్యధిక విద్యుత్తు సంస్థలు అప్పులు తిరిగి చెల్లించకుండా చతికిలబడ్డాయి. విద్యుత్తు పంపిణీ కంపెనీలకు బహిరంగమార్కెట్‌లో దాదాపు సగం ధరకే విద్యుత్తు అందుబాటులో నుండటంతో ఈ కంపెనీలు పై విద్యుత్తు సంస్థలనుండి విద్యుత్తు కొనుగోలు చేయటానికి సుముఖంగా లేవు. దీనికి ఇంకా ఇతర కారణాలు కూడా తోడవుతున్నాయి. మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని అత్యధికంగా పెంపుజేసి, ఆ పెంపు నిధులను ప్రైవేటు వ్యాపార సంస్థలకు, తమ అధికార రాజకీయాధినేతలకు అందేట్లు చేయటం జరుగుతోంది. దీని ఫలితంగా సృష్టించిన సంపద యొక్క వాస్తవిక విలువ, ఖర్చుచేసిన మొత్తానికంటే చాలా తక్కువగా వుంటోంది. సహజంగా వాస్తవ సామర్థ్యాన్ని మించి అవి ఆదాయాన్ని సృష్టించలేవు.

స్థూల ఆర్థిక స్థాయిలో, కొద్దిపాటి ప్రారంభ సం॥లను మినహాయిస్తే, మన దేశంలోకి వచ్చిన అత్యధిక విదేశీ పెట్టుబడి, కొత్త పరిశ్రమలను కల్పించకపోగా, ఉనికిలో వున్న పరిశ్రమలను కబళించివేయటమే జరిగింది. అదే సమయంలో బడా కార్పొరేట్లకు, ప్రత్యేకించి విదేశీ పెట్టుబడి ప్రయోజనాలకు, పెద్దపీటవేసే విధానాలను ప్రభుత్వం అమలుచేస్తుండటంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలన్నీ క్రమంగా మూతబడ్తున్నాయి. ఫలితంగా, ప్రభుత్వ, పాలక నాయకుల, వారి మద్దతుదార్ల గొప్పగొప్ప ప్రకటనలకు భిన్నంగా తయారీ రంగం కోలుకోలేనంతగా కునారిల్లి పోతోంది.

జిడిపి గణాంకాల గురించి పదేపదే చెప్పటం కూడా ఈ వాస్తవాలను దాచి పెట్టబోదు. గత పది సం॥ల కాలంగా మొత్తంపై జిడిపి అభివృద్ధి రేటు 7 శాతంగా వుంది. కాగా ఉత్పత్తి రంగం వాటా దీనిలో 4శాతంగానూ, వ్యవసాయరంగం వాటా 2 శాతానికి లోపుగానూ వుంది. వ్యంగ్యంగా చెప్పుకుంటే, ఈ 'హిందూ గ్రోత్ రేటు'తో ఆర్థిక వ్యవస్థ ఉద్యోగకల్పన చేయలేకపోతోంది; డిమాండ్‌ను సృష్టించలేకపోతోంది. అయినప్పటికీ స్టాక్‌మార్కెట్లు పరుగులు తీస్తూ సెన్సెక్స్ నూతన రికార్డు స్థాయిలను నమోదు చేస్తోంది. చిన్న పరిశ్రమను, చిన్న వ్యాపారులను కబళించివేస్తూ బడా బూర్జువాలు లాభాలు సంపాదిస్తున్నారని దీని అర్థం.

ఐఎల్ఎఫ్ఎస్ భంగపాటుకు మూలం, ప్రభుత్వ తల్లక్రిందుల అభివృద్ధి విధానంలో వుంది. ఎవరికి ఉపయోగపడుతుందో ఎలాంటి అవగాహన కూడా లేకుండా, భారీ మౌలిక వసతుల కల్పన చేయటం ఎలాంటిదంటే, ఒక ఆర్థికవేత్త పేర్కొన్నట్లు పూటగడవని ఒక వ్యక్తి నివసించటానికి సర్వహంగులతో ఓ ఇల్లు నిర్మించుకున్న దానితో సమానమౌతుంది.

ఐఎల్ఎఫ్ఎస్‌ను ప్రభుత్వం ఇంత హడావుడిగా తన అధీనంలోకి తీసుకోవటంలోని ఆంతర్యమేమంటే, ఐఎల్ఎఫ్ఎస్ పూర్తిగా పతనం గాకుండా దానివెనుక తానున్నానని ద్రవ్య సంస్థలకు అనగా విదేశీ మదుపుదార్లకు ప్రభుత్వం హామీ ఇవ్వటంతోపాటు, ప్రజాధనంతో వారి అప్పులన్నీ చెల్లింపు చేస్తానని ప్రకటించటమే.

ఐఎల్ఎఫ్ఎస్‌ను ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకున్న తర్వాత, నేషనల్ కంపెనీ 'లా' ట్రిబ్యునల్ వద్దకు వెళ్ళి రుణదాతలపై మారిటోరియం ప్రకటించవలసిందిగా కోరింది. అనేక బడా మౌలిక వసతుల ప్రాజెక్టులు ఇప్పటికే పనులు నిలిపివేసి తమవద్ద పనిచేసే వేలాదిమంది కార్మికులను రోడ్లపైకి విసిరి వేస్తున్నాయి. రాబోయే కాలంలో ఐఎల్ఎఫ్ఎస్ ఉదంతం మధ్యతరగతి వర్గాలపై ప్రభావం చూపబోతోంది. ఎల్ఐసి, యుటిఐ వంటి ఇతర సంస్థలలో మదుపుచేసిన తమ కష్టార్జితం ఐఎల్ఎఫ్ఎస్‌లో కుదువపెట్టబడింది. అవి తిరిగి రావటం అనేక చిక్కుల్లో పడనుంది. చిన్న వ్యాపారులకు, చిన్న పారిశ్రామికవేత్తలకు మార్కెట్ నుండి నిర్వహణ మూలధనం సమకూర్చు కోవటమే కష్టతరమౌతుంది. ఐఎల్ఎఫ్ఎస్ భంగపాటు యొక్క ప్రభావం దీర్ఘకాలంలో ప్రజల వీపులపై భారంగా మోపబడుతుంది.

ఐఎల్ఎఫ్ఎస్ భంగపాటు హటాత్తుగా జరిగిన ఘటనగా కనపడవచ్చు. కానీ ఇది ఎంతోకాలంగా లోలోన మరుగుతున్న అంశమే. ఇన్ని సంవత్సరాలుగా భారత ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగాన్ని కుదిపివేస్తున్న, నానాటికీ పెరుగుతోన్న సంక్షోభంలో భాగమే ఇది. ఈ సంక్షోభం సద్దుమణగబోవటంలేదు; పైగా రానున్న కొద్ది కాలంలోనే ప్రజాజీవితాలపై క్రూరంగా దాడి చేయబోతోంది.

ooooo